గట్టెక్కిన ప్రయాణికుల కష్టాలు

- రూ.18 కోట్లతో కంచికచర్ల-పెద్దాపురం రహదారి
- విస్తరణ, అభివృద్ధితో ప్రజల హర్షాతిరేకం



విస్తరణ, అభివృద్ధి చేసిన కంచికచర్ల-పెద్దాపురం రహదారి

వీరులపాడు: కంచికచర్ల-పెద్దాపురం రహదారి గతంలో గుంతల మయంగా ఉండి ప్రయాణం నరక ప్రాయంగా ఉండేది. ఈ రహదారిపై రాకపోకలు సాగించాలంటే గమ్యస్థానాలకు సురక్షితంగా చేరతామా అనేంతగా ప్రజలు ఆందోళన చెందేవారు. రెండు తెలుగు రాష్ట్రాలను అనుసంధానం చేసే ఈ రహదారిపై నిత్యం ఐదారు వేలకు పైగా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రహదారిని అభివృద్ధి చేయాలని పలుమార్లు విజ్ఞప్తులు చేసినా గత తెలుగుదేశం పాలకులు, అధికారులు కనీసం స్పందించలేదు. ప్రస్తుత శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్మోహనరావు అధికారంలోకి రాగానే రహదారిని విస్తరించి అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

రూ.18 కోట్లతో రహదారి అభివృద్ధి

ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని విస్మరించకుండా అధికారంలోకి రాగానే రహదారి దుస్థితిని శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్‌తో కలిసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే స్పందించిన ముఖ్యమంత్రి కంచికచర్ల నుంచి పెద్దాపురం వరకు రహదారిని విస్తరించి అభివృద్ధి చేసేందుకు రూ.18 కోట్లు నిధులను మంజూరు చేశారు. ఈ నిధులతో రహదారి నిర్మాణ పనులను ప్రారంభించి శరవేగంగా పనులను నిర్వహిస్తున్నారు. నాణ్యతా ప్రమాణాలలో రాజీపడకుండా రోడ్డు పనులు సాగించటంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

సమస్య పరిష్కారమైంది



ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించటమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారు. గతంలో ఈ రహదారిపై ప్రయాణాలు సాగించేందుకు ప్రజలు నానా అవస్థలు పడేవారు. ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ అరుణకుమార్ చొరవతో రహదారి సమస్య పరిష్కారమైంది.

–పూల పూర్ణ
జుజ్జూరు

శరవేగంగా పనులు



కంచికచర్ల నుంచి పెద్దాపురం రహదారి విస్తరణ, అభివృద్ధి పనులు నిర్వహించటం అభినందనీయం. రహదారి అధ్వానంగా మారటంతో రాకపోకలు సాగించేందుకు నానా ఇబ్బందులు పడేవాళ్లం. రహదారికి నిధులు మంజూరైన నాటి నుంచి పనులు శర వేగంగా సాగుతున్నాయి.

–బుజ్జి
జయంతి

క్లుప్తంగా

నేడు అధికారుల సమన్వయ సమావేశం

పెనుగంచిప్రోలు: గ్రామంలోని శ్రీతిరుపతమ్మ వారి చిన్న తిరునాళ్ల ఉత్సవాలకు సంబంధించి శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ఆలయ ఆవరణలో నందిగామ ఆర్డీఓ రవీంద్రరావు అధ్యక్షతన అధికారుల సమన్వయ సమావేశం జరుగుతుందని ఆలయ ఈఓ లీలాకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత శాఖల అధికారులందరూ సమావేశానికి హాజరు కావాలన్నారు. ఉత్సవాలు మార్చి 7 నుంచి 11 వరకు జరుగుతాయన్నారు.

తిరుపతమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



పెనుగంచిప్రోలు: గ్రామంలోని శ్రీతిరుపతమ్మ వారిని శుక్రవారం భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. పలు శుభకార్యాలు ఉండటంతో పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి. భక్తులు అమ్మవారికి పాలు, పొంగళ్లు సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. నూతన జంటలతో ఆలయ పరిసరాలు కళకళలాడాయి.

ప్రారంభమైన నవదిన జపాలు

నందిగామ: సిలువగిరి తిరుణాల మహోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించే నవదిన జపాలు, ప్రత్యేక దివ్య బలి పూజా కార్యక్రమాలు శుక్రవారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఫాదర్ గాబ్రియేలు ప్రత్యేక వాక్యోపదేశం చేశారు. అనంతరం దివ్య బలి పూజా కార్యక్రమం నిర్వహించారు. రాత్రి పొద్దుపోయే వరకు జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రభువు మాలధారులు, విశ్వాసులు పాల్గొన్నారు.

చిరు ధాన్యాలతో ఆరోగ్యం



గరికపాడు(జగ్గయ్యపేట): చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మేలని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) కోఆర్డినేటర్ వెంకట సుబ్బయ్య అన్నారు. స్థానిక కేవీకేలో చిరుధాన్యాలపై శుక్రవారం మహిళలకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాలు అనేక పోషక విలువలు కలిగి ఉన్నాయన్నారు. ప్రస్తుత జీవన విధానంలో చిరు ధాన్యాలను ప్రతిరోజు ఆహారంగా తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో రైతులు పంటలుగా కూడా సాగు చేయవచ్చని చెప్పారు. అనంతరం చిరు ధాన్యాలపై ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో గృహ విజ్ఞాన శాస్త్రవేత్త ప్రభావతి, కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

కౌలు వేలం పాటలు వాయిదా

వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలో ఉన్న యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి చెందిన భూముల కౌలు వేలం పాటలు వాయిదా వేసినట్లు ఈవో నాగరాజు శుక్రవారం తెలిపారు. ఈ పాటలు శుక్రవారం జరగాల్సి ఉండగా పాటదారులు రాకపోవటంతో వాయిదా వేశామన్నారు.

అమ్రితసాయిలో ముగిసిన స్పోర్ట్స్ డే వేడుకలు



కంచికచర్ల: మండలంలోని పరిటాల అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాలలో స్పోర్ట్స్ డే నిర్వహించినట్లు కళాశాల కరస్పాండెంట్ కె.రామ్మోహన్‌రావు శుక్రవారం తెలిపారు. విద్యార్థులకు కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, త్రోబాల్, టెన్నికాయిట్ తదితర ఆటల పోటీలు నిర్వహించామన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శశిధర్, అకడమిక్ డైరెక్టర్ పి.చిరంజీవి, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శరవేగంగా రామాలయ నిర్మాణ పనులు



లింగగూడెం(పెనుగంచిప్రోలు): గ్రామంలో నూతన రామాలయ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. గ్రామస్తులు, భక్తుల విరాళాలతో ఆలయ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కొద్ది రోజుల్లో ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

నేడు 'డయల్ యువర్ ఆర్టీసీ డీఎం'

ఇబ్రహీంపట్నం: స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం డయల్ యువర్ ఆర్టీసీ డిపో మేనేజర్ కార్యక్రమం శనివారం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ఎ.సుబ్రహ్మణ్యం శుక్రవారం తెలిపారు. డిపో పరిధిలో ప్రయాణికులు ఉదయం 11 గంటల నుంచి 12 గంటల మధ్య 99592 25457 నంబర్‌కు ఫోన్‌చేసి తమ సమస్యలు, సలహాలు, సూచనలు తెలియజేయాలన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు



దొనబండ రాతి క్వారీలకు వెళ్లే రోడ్డుపై సిమెంట్ బ్లాక్‌లు అడ్డుపెడుతున్న సీఐ, ఎస్‌ఐ

కంచికచర్ల: పోలీస్ కమిషనర్ టీకే రాణా, డీసీపీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు నందిగామ ఏసీపీ జి.నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని నందిగామ రూరల్ సీఐ ఐవీ నాగేంద్రకుమార్ తెలిపారు. కంచికచర్ల మండలం పరిటాల శివారు దొనబండ రాతి క్వారీలకు వెళ్లే రోడ్డుపై శుక్రవారం రోడ్డు ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు సిమెంట్ బ్లాక్‌లు ఏర్పాటుచేయించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇప్పటికే మండలంలోని పలు ప్రాంతాల్లో నేషనల్ హైవేపై రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించామన్నారు. పరిటాల, కీసర, పేరకలపాడు క్రాస్‌రోడ్డు, కంచిలమ్మ చెరువుకట్ట చెవిటికల్లు సెంటర్ తదితర ప్రాంతాలను గుర్తించి ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. నేషనల్ హైవే మీదుగా దొనబండ రాతి క్వారీలకు నిత్యం వందల సంఖ్యలో లారీలు, టిప్పర్లు రాకపోకలు సాగిస్తుంటాయని వాటి వల్ల హైదరాబాద్- విజయవాడ వెళ్లే వాహనదారులకు ఎటువంటి ప్రమాదాలు జరగకుండా దాతల సహకారంతో సిమెంట్ బ్లాకులు ఏర్పాటు చేశామన్నారు. వేగం కన్నా ప్రాణం మిన్న అని, రోడ్డు ప్రమాదం జరిగితే ఆ ఒక్కడికే కాదని, కుటుంబం మొత్తానికి ప్రమాదం అన్న సంగతి ప్రతి ఒక్క వాహనదారుడు గుర్తుంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం, పోలీస్ సిబ్బంది, టోల్‌ప్లాజా సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా సీఎం పాలన

- గుడిమెట్లలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు
- శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ



అంబేడ్కర్ విగ్రహ శంకుస్థాపన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ అన్నారు. చందర్లపాడు మండలంలోని గుడిమెట్ల గ్రామంలో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ నిర్మాణానికి గురువారం రాత్రి వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయటం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు యార్లగడ్డ ప్రసాద్, బుగ్గినేని సురేష్, దళిత చైతన్య వేదిక నాయకులు కన్నెకంటి సజ్జనరావు, పెసరమల్లి శేఖర్, యాంపోగు నాగరాజు, మొగిలిచర్ల లక్ష్మీకాంత్, దేవ సహాయం, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళా కబడ్డీ పోటీల ఏర్పాట్లు పరిశీలన



రాష్ట్ర స్థాయి మహిళా కబడ్డీ పోటీల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్ర స్థాయి మహిళా ఆహ్వాన కబడ్డీ పోటీలు జగ్గయ్యపేటలోని ఎస్‌జీఎస్ కళాశాలలో ఈనెల 27 నుంచి జరుగుతాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాల గ్రౌండ్‌లో జరుగుతున్న ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ తమ సోదరుడైన సామినేని వెంకట మల్లికార్జున ప్రసాద్ (ఎస్‌వీఎం ప్రసాద్) మెమోరియల్ పేరుతో జరిగే ఈ పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల నుంచి ప్రముఖ జట్లు రానున్నాయని తెలిపారు. ఈ పోటీలను రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనిత ప్రారంభిస్తారని, చివరి రోజు మార్చి 1 న బహుమతి ప్రదానోత్సవానికి రాష్ట్ర పర్యాటక, క్రీడల శాఖ మంత్రి ఆర్కే రోజా రానున్నారని తెలిపారు. విజేతలకు వరుసగా రూ.లక్ష, రూ.75 వేలు, రూ.50 వేలు, రూ.25 వేల చొప్పున బహుమతులు అందజేస్తామని, పెద్ద సంఖ్యలో వచ్చే క్రీడాభిమానుల కోసం గ్యాలరీలు వంటి సౌకర్యాలను ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పరిటాల పొలాల్లో సరిహద్దు రాళ్ల ఏర్పాటు

కంచికచర్ల: మండలంలోని పరిటాల గ్రామంలో జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం కింద రీ సర్వే చేసి శుక్రవారం ప్రభుత్వం పంపిణీ చేసిన సరిహద్దు రాళ్లను పాతారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి మాట్లాడుతూ గత మూడు రోజుల నుంచి రైతుల పొలాల్లో సరిహద్దు రాళ్లను పాతుతున్నామని తెలిపారు. రైతులు పొలానికి ప్రభుత్వం జారీ చేసిన భూ హక్కు పత్రంతో హాజరు కావాలని కోరారు. స్టోన్ ప్లాంటేషన్ వచ్చే నెల మార్చి 15తేదీలోగా పూర్తిచేస్తామన్నారు. రైతులు, కౌలురైతులు ఇందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ ఆఫ్ సర్వేయర్ నంద్రు అనూష్‌కుమార్, డీటీ నాగుల్‌మీరా, ఆర్ఐ శిరీష, వీఆర్వోలు వేముల ప్రదక్షిణరావు, శ్రీలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ యాంటీ బులియింగ్ డే సదస్సు

జగ్గయ్యపేట అర్బన్: బ్రహ్మ కుమారీల ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక విజ్ఞాన్ హైస్కూల్‌లో యాంటీ బులియింగ్ డే సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ తన్నీరు సుధారాణి అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో బ్రహ్మ కుమారి సోదరి వాణి మాట్లాడుతూ బులియింగ్ అనగా ఇతరులను మన మాటలు, చేతలతో కించపరచడం, మన ప్రవర్తనతో బాధించడం అని తెలిపారు. ఈర్ష్యాద్వేషాలు లేని ఆరోగ్యవంతమైన, అర్థవంతమైన సమాజాన్ని నిర్మించాలంటే చదువుతో పాటు మంచి సంస్కారాన్ని అలవరచుకోవాలన్నారు. బ్రహ్మ కుమారీస్ ప్రతినిధి పట్టాభిరామయ్య(అబ్బు), ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

నందిగామ: పట్టణంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లాలో బార్ అసోసియేషన్ సభ్యుడు నరేంద్రపై జరిగిన దాడికి నిరసనగా, మచిలీపట్నంలో లక్ష్మీనారాయణ అనే న్యాయవాదిపై పోలీసులు తప్పుడు కేసు నమోదు చేయడాన్ని నిరసిస్తూ విధులు బహిష్కరించినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కన్నెగంటి జీవరత్నం తెలిపారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీదుర్గామల్లేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని దుర్గాపురంలో ఉన్న శ్రీదుర్గామల్లేశ్వరస్వామి ఆలయం 29 వ వార్షికోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు శ్రీకనకదుర్గ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారికి దేవస్థాన ప్రధాన అర్చకుడు చింతా శివరామశర్మ ఆధ్వర్యంలో భక్తులు పంచామృత అభిషేకాలు, హోమాలు, కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళా కోలాట బృందం వారి నృత్యాలు అలరించాయి. అనంతరం మధ్యాహ్నం జరిగిన అన్నసమారాధన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రీసర్వేతో భూముల సరిహద్దు వివాదాలకు చెక్

వీరులపాడు: ప్రభుత్వం నిర్వహిస్తున్న భూముల రీసర్వేతో భూ వివాదాలకు స్వస్తి పలకవచ్చని తహసీల్దార్ ఆశయ నాయక్, సర్పంచ్ బొమ్మిశెట్టి దుర్గాదేవి అన్నారు. మండలంలోని నరసింహారావుపాలెం గ్రామంలో నిర్వహిస్తున్న భూముల రీ సర్వేను శుక్రవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వే బృంద సభ్యులు నిష్పక్షపాతంగా సర్వే చేయాలని తెలిపారు. రైతులు కూడా సిబ్బందికి సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ బొమ్మిశెట్టి భాస్కరరావు, ఎంపీటీసీ సభ్యుడు శీలం రమణారెడ్డి, గ్రామ నాయకుడు పచ్చాల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా ధర్నా



నందిగామ: కేంద్రప్రభుత్వం సామాన్యులపై భారం వేసి అదానీ లాంటి వాళ్లకు దోచిపెడుతోందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చనుమోలు సైదులు మండిపడ్డారు. కేంద్ర విధానాలకు నిరసనగా శుక్రవారం నందిగామ పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కేంద్రం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్యులకు ఉపయోగపడేదిగా లేదని, కేవలం కార్పొరేట్ సంస్థలకు మేలు చేసేదిలా ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకటేశ్వరరావు, లాల్ సలాం, గోపీనాయక్, హుస్సేన్, లాజర్, శ్రీను, వెంకటేశ్వర్లు, హనుమంతరావు, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలంతా వైఎస్సార్ సీపీ విజయానికి కృషిచేయాలి

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ మైనార్టీ విభాగం అధ్యక్షుడు రస్ హుస్సేన్



సమావేశంలో మాట్లాడుతున్న రస్ హుస్సేన్, హాజరైన మైనార్టీ నాయకులు, కార్యకర్తలు

జగ్గయ్యపేట అర్బన్: ముస్లింలంతా కలిసికట్టుగా నిలిచి వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ రస్ హుస్సేన్ పిలుపునిచ్చారు. స్థానిక పోస్టాఫీసు వద్ద ఉన్న వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం పట్టణ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ స్థాయి ముస్లిం ఐక్య వేదిక పేరిట ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశానికి రస్ హుస్సేన్ అధ్యక్షత వహించారు. సమావేశంలో మైనార్టీ విభాగం పట్టణ అధ్యక్షుడు షేక్ మొహిద్దీన్ తదితరులు మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ముస్లింలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని, ఉన్నత పదవుల్లో స్థానాలు కల్పిస్తూ భరోసా కల్పించారన్నారు. నియోజకవర్గంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఉదయభాను ముస్లింలకు అన్ని విధాలుగా సహకారం అందిస్తూ అండగా నిలుస్తున్నారన్నారు. ముస్లింలంతా ఐక్యతతో వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి మంచి మెజార్టీ వచ్చేలా కృషిచేయాలని తెలిపారు. త్వరలో మైనార్టీ విభాగం గ్రామ పట్టణ, మండల, నియోజకవర్గ స్థాయి కమిటీలను ఏర్పాటుచేయాలని సమావేశంలో తీర్మానించారు. మైనార్టీ విభాగం పట్టణ అధ్యక్షుడు షేక్ మొహిద్దీన్, గౌరవరం సొసైటీ అధ్యక్షుడు బాల్‌సైదా, దర్గా కమిటీ అధ్యక్షుడు షేక్ ఖాజా, షాదీఖానా అధ్యక్షుడు ఎక్సైజ్ బాషా, ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు అక్బర్‌ఖాన్, నాయకులు పఠాన్ ఫిరోజ్‌ఖాన్, ఎన్ఎస్‌పీ ఖాసిం సైదా, జుబేర్, మాజీ కౌన్సిలర్ జాన్‌బాషా, ముజీబ్, కోఆప్షన్ సభ్యుడు ఖాదర్ బాబు, షేక్ హసన్, మాజీ ఎంపీటీసీలు షాబుద్దీన్, నాగుల్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను వివరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వవిప్ ఉదయభాను

మక్కపేట(వత్సవాయి): రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం అందజేస్తున్న పథకాల గురించి ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను తెలిపారు. మండలంలోని మక్కపేట, భీమవరం, గోపినేనిపాలెం, మంగొల్లు, దేచుపాలెం, చిన్నమోదుగపల్లి, పెద్దమోదుగపల్లి, ఇందుగపల్లి, కన్నెవీడు, రామచంద్రాపురం గ్రామాలకు చెందిన వలంటీర్లు, గృహసారథులతో శుక్రవారం ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మన ప్రభుత్వం చేసిన మంచి పనుల గురించి తెలపడం మనందరి బాధ్యత అని గుర్తుచేశారు. గృహసారథులే గ్రామాభివృద్ధికి వారధులుగా నిలవాలన్నారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, యువ నాయకుడు సామినేని వెంకటకృష్ణప్రసాద్, సర్పంచులు గుడేటి శారమ్మ, అన్నెపాక ప్రణీత, బొల్లం నారాయణప్రసాద్, బాణావతు శ్రీనువాసరావు, నేలవెల్లి వెంకటప్పయ్య, చావా దుర్గారాణి, పాపినేని రాజేశ్వరి, భీమాల సుజాత, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గాదెల రామారావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు కనగాల రమేష్, చింతకుంట్ల వెంకటరెడ్డి, గుండం రంగారెడ్డి పాల్గొన్నారు.

ఏడాదిలో సీతారామాలయం పునఃనిర్మాణం



ఆలయాన్ని పరిశీలిస్తున్న ఏఈ నాగేంద్రకుమార్

జగ్గయ్యపేట: ఏడాదిలోగా పట్టణంలోని సీతారామాలయం (పెద్ద రామాలయం) పునః నిర్మాణ పనులు పూర్తి చేస్తామని దేవదాయ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ నాగేంద్ర కుమార్ తెలిపారు. పట్టణంలోని పెద్ద రామాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 300 ఏళ్ల నాటి ఈ రామాలయం ఎంతో ప్రాచుర్యం కలిగిందన్నారు. సీజీఎఫ్ నిధుల ద్వారా రూ.1.20 కోట్లతో పునః నిర్మాణ పనులు చేపడతామన్నారు. ఇప్పటికే ఈ ఆలయానికి సంబంధించిన పునః నిర్మాణ మ్యాప్‌లను కూడా దేవదాయ శాఖ ఉన్నతాధికారులు అనుమతించారని తెలిపారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా నిర్మాణం చేపడుతున్నామని, ముఖ మండపం, క్లోజ్డ్ మండపం, నాలుగు ఉపాలయాలు, మూడు రాజగోపురాలు, ధ్వజ స్తంభం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కొద్ది రోజుల్లో పునః నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహిస్తామన్నారు. పునః నిర్మాణ సమయంలో ఆలయంలోని గర్భ గుడిలోని విగ్రహాలను ఆలయ ప్రాంగణంలోని బాలాలయంలో ఏర్పాటు చేసి అర్చకులు ధూపదీప నైవేద్యాలు నిర్వహిస్తారని చెప్పారు. రెండు రోజుల్లో మట్టి నమూనా పరీక్షలు చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో స్థపతి సతీష్, ఆలయ ఇన్‌చార్జ్ ఈవో నాగరాజు, ఆలయ పాలకవర్గ ప్రతినిధి తుమ్మేపల్లి వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల అందజేత



సీఎం సహాయనిధి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామటౌన్: వైద్య ఖర్చుల భారం నిరుపేదలపై పడకుండా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆరుగురు లబ్ధిదారులకు మంజూరైన రూ.4.11 లక్షల చెక్కులను స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో సీఎంఆర్‌ఎఫ్ పథకం కింద ఇప్పటి వరకు 384 మందికి రూ.2.02 కోట్లను అందజేశామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి చల్లా బ్రహ్మేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు చిరుమామిళ్ల చైతన్య కుమార్, వైఎస్ఎన్ ప్రసాద్, పారుపల్లి హరిబాబు, ఎంవై దాస్, ఐలపోగు రామయ్య, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు



వార్డు పరిధిలో పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలిస్తున్న కమిషనర్

నందిగామ: పారిశుధ్య సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని కమిషనర్ డాక్టర్ జయరాం హెచ్చరించారు. పట్టణ పరిధిలోని 18 వ వార్డు పరిధిలో జరుగుతున్న పారిశుధ్య పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆ సమయంలో వార్డు పరిధిలోని ఓ రహదారి వెంట రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరిగి ఉండడాన్ని గమనించిన ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిబ్బంది సంబంధిత వార్డుల పరిధిలో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా రహదారుల వెంట పిచ్చి మొక్కలు పెరగకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయన వెంట సచివాలయ సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.